క్లుప్తంగా

వేమన వేడుకలు



వేమన చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సంఘం నేతలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో రెడ్డీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం యోగి వేమన 373 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు నివాళి



మురళికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ సిద్దులగారి మురళి ఇటీవల మరణించారు. ఆదివారం ఆయన కర్మ క్రియలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆయన నివాసానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు సిద్దులగారి ప్రసాద్, సతీష్, పఠాన్ ఫరీద్, శ్రీవారి సురేష్, మున్నా రాయల్, డిష్ గిరి, తీగల హరికృష్ణ, పూల చిన్నబ్బ పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి : పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటన సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. గోబ్యాక్ అమిత్‌షా, గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, రాధమ్మ, రాపూరు సుబ్రహ్మణ్యం, అన్వర్ బాషా పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో అమ్మవారు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట పంచాయతీలోని భగత్‌సింగ్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ కొల్లాపురి అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూజారి నాయుడమ్మ ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజ, హోమ పూజలు జరిపి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారికి విశేష అభిషేక పూజలు చేసి శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీసిటీ స్టాల్‌కు స్పందన



సూళ్లూరుపేట ఫ్లెమింగో ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్‌ను సందర్శిస్తున్న పర్యాటకులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): సూళ్లూరుపేటలోని ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానంలో ఏర్పాటు చేసిన శ్రీసిటీ స్టాల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు, పర్యాటకులు, సామాన్య ప్రజల సందర్శనతో విశేష స్పందన లభించింది. ఈ స్టాల్‌లో చాక్లెట్లు, ఆహార పదార్థాలు, ఎయిర్ కండీషనర్లు, ఆటో మొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్, లైట్ ఇంజినీరింగ్ రంగాల ఉత్పత్తుల నమూనాలతో శ్రీ సిటీ ప్రగతి దృశ్యాన్ని ప్రదర్శించారు. పారిశ్రామిక విజయాలతో పాటు సుస్థిర, సామాజిక సంక్షేమంపై శ్రీసిటీ నిబద్ధతను హైలెట్ చేసింది. పరిశ్రమలతో పాటు హరితహిత కార్యక్రమాలు, సమాజ శ్రేయస్సు కోసం చేపట్టిన సామాజిక బాధ్యత ప్రాజెక్టులు, ప్రకృతి సంరక్షణ, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలను ప్రతిబింబించే ఆకర్షణీయ ఫొటో డిస్‌ప్లేలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

నది చెంత.. చెత్త చింత



నారాయణవనం వీధుల్లో చెత్తా చెదారాన్ని అరుణా నదిలో పడేస్తున్నారు. దీనికి తోడు రంగు పరిశ్రమల నుంచి వ్యర్థాలు తోడు కావడంతో జలచరాలకు ప్రాణ సంకటంగా మారింది. నారాయణవనంలో రోజూ సేకరించే చెత్త నుంచి సంపదను సృష్టించడాన్ని విస్మరించి, ఇలా చెత్తను అరుణానది ఒడ్డున గుట్టలుగా వేస్తున్నారు. తుపాను ప్రభావంతో పొంగిన నదీ ప్రవాహంలో వ్యర్థాలు కలిసిపోతున్నాయి.

– నారాయణవనం

కంకర .. పనులు వంకర

వరుసగా అయిదేళ్లుగా వర్షాలతో ప్రవహించిన అరుణానది ఉధృతికి తుంబూరు కాజ్‌వే కొట్టుకుపోతున్న ప్రతిసారి రాకపోకలకు అనువుగా గ్రావెల్, ఇసుక మూటలతో తాత్కాలిక మరమ్మతులు చేసి మమ అనిపించారు. నాలుగు నెలల్లో మూడు సార్లు కాజ్‌వే కోతకు గురైంది. తొలిసారి ఇసుకమూటలు, ఎర్రమట్టితో మరమ్మతులు.. రెండో సారి కోతకు గురైనప్పుడు కంకరను పరిచిన మరుసటి రోజునే నది ప్రవాహానికి కొట్టుకుపోయింది. తీరు మారని అధికారులు మరోసారి కంకర పరిచి చేతులు దులుపుకున్నారు. – నారాయణవనం



తీగల మీదే భారం.. భద్రత ఘోరం



మండలంలో సముదాయం నుంచి బొప్పరాజుపాళెంకు వెళ్లే రహదారిలో అరుణానది లోలెవల్ కాజ్‌వే మధ్యలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభానికి అడుగున కాంక్రీట్ కట్టడం నదీ ప్రవాహానికి తొలగిపోయింది. కేవలం తీగలతోనే స్తంభం నిలిచి ఉంది.నారాయణవనం నుంచి నగరికి సుమారు 6 కిలోమీటర్ల దూరం తగ్గే ఈ రహదారిలోనే ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదకరంగా స్తంభం వాలి ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

– నారాయణవనం

షాడో సర్పంచులు

- అధికారాలకు కూటమి కత్తెర
- సర్పంచుల ప్రమేయం లేకుండానే పనులు
- స్థానికంలో కూటమి మార్కు వ్యూహం

స్థానిక సంస్థల్లో పట్టు సాధించేందుకు ముందస్తు వ్యూహంతో తమ మార్పును చూపించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఆ దిశగా ఉపాధి పథకాన్ని కూటమి నేతలకు దోచి పెడుతోంది. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నామని ప్రచారం మొదలు పెట్టారు. అయితే గ్రామ ప్రథమ పౌరుల అధికారాలను హరిస్తూ రాత్రికి రాత్రే నూతన జీఓలను ప్రవేశపెట్టి, కార్యదర్శులను అడ్డం పెట్టుకుని సర్పంచు అధికారానికి కోతలు పెట్టారు. నేడు కూటమి సర్కారు పంచాయతీ సర్పంచులపై కక్ష పూరితంగా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.



పిచ్చాటూరు : పచ్చ కండువా ధరించి సిమెంటు రోడ్డు పనులు చేపడుతున్న టీడీపీ నాయకుడు

సత్యవేడు నియోజకవర్గంలో మండలాల వారీగా కేటాయించిన పనులు, నిధుల వివరాలు (రూ.కోట్లలో)

మండలం పేరు	పంచాయతీలు	పల్లె పండుగ పనులు	మంజూరైన నిధులు
బీఎన్‌కండ్రిగ	24	44	2.00
కేవీబీపురం	29	37	1.99
నాగలాపురం	19	41	1.42
నారాయణవనం	18	23	6.11
పిచ్చాటూరు	21	34	1.43
సత్యవేడు	29	64	1.93
వరదయ్యపాళెం	29	32	1.70



సత్యవేడు : నాసిరకంగా చేపడుతున్న సిమెంటు రోడ్డు పనులు

వరదయ్యపాళెం : పల్లె పండుగ పనులు కూటమి నేతలకు పందేరమయ్యాయి. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 169 పంచాయతీలు ఉన్నాయి. ఆ పంచాయతీలకు సంబంధించి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా 275 పనులు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా సీసీ రోడ్లు, ఇతర పనుల నిర్మాణం కోసం రూ. 19.68 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ దిశగా ఈ పనులు చేపట్టేందుకు గతేడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రధానంగా ఈ సభల్లో సిమెంటు రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకునేందుకు పంచాయతీల పాలక వర్గాలు, స్థానిక ప్రజల ఆమోదం కోసం చర్చించారు. అయితే ఏకంగా సందట్లో సడేమియా అని ఖాళీ పేపర్లలో తీర్మాన పత్రాలపై సంతకాలు చేసుకుని కూటమి నేతలకు పల్లె పండుగ పందేరం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఏక కాలంలో జరిగిన గ్రామ సభలు దొంగచాటున కూటమి నేతలకు పనులు అప్పజెప్పేందుకు కేంద్రమయ్యాయి.

కూటమి నేతల దోపిడీకి ఉపాధి నిధులు

పల్లె పండుగ పేరుతో చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు కూటమి నేతల దోపిడీకి వరంగా మారాయి. అధికారంలోకి వచ్చిన 6 నెలలకే వారికి బంఫర్ ఆఫర్ ప్రకటిస్తూ సర్పంచుల అధికారాలను సైతం విస్మరించి కూటమి నేతలకు పనులను ముట్టజెప్పారు. దీంతో నామమాత్రపు అధికారుల పర్యవేక్షణతో సందట్లో సడేమియా అంటూ నాసిరకంగా పనులు కానిచ్చేస్తూ దోపిడీకి సిద్ధమవుతున్నారు.

కూటమి నేతల చెప్పుచేతల్లో..



ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచిన సర్పంచుల అధికారాలకు కూటమి ప్రభుత్వం కత్తెర పెట్టింది. మా అధికారాలు పూర్తిగా వారి చెప్పు చేతల్లోకి తీసుకున్నారు. దీంతో ప్రభుత్వానికి సంబంధించి అధికారిక కార్యక్రమాల్లో మా పత్తా లేకుండా చేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఉపాధి హామీ పథకం నిధులు సైతం కూటమి వర్గీయులకే కేటాయిస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు.

– బాలకృష్ణ, సర్పంచ్, పులివల్లం, వరదయ్యపాళెం మండలం

సర్పంచ్ అధికారాలు యథావిధంగా ఉండాలి



గ్రామ ప్రథమ పౌరుడిగా రాజ్యాంగంలోని గ్రామ సర్పంచ్‌కు ఉన్నత విలువలు కేటాయించారు. అయితే కూటమి సర్కారు రాజ్యాంగ నిబంధనలను సైతం తుంగలో తొక్కి సర్పంచ్ అధికారాలపై కూటమి నేతల పెత్తనానికి సిద్ధమయ్యారు. ఇది ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచినంత పని. అధికారులు సైతం సర్పంచ్‌లను చిన్నచూపు చూడడం సరికాదు.

– దీప, సర్పంచ్, కాంబాకం, వరదయ్యపాళెం మండలం

తీర్మానాలు లేకనే పనులు



మాది సత్యవేడు మండలం ఏఎంపురం పంచాయతీ. గ్రామసభల ఆమోదం లేకనే గ్రామ పంచాయతీ అడ్డదిడ్డంగా పల్లెపండుగ పనులు చేపడుతున్నారు. పనులు చేపట్టాక తీర్మానాలు అడుగుతున్నారు. తీర్మానాలు ఇవ్వకపోతే వేరొక రకంగా బెదిరింపులకు గురిచేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన పనులు వారికి ఇష్టమొచ్చినట్లు చేపట్టడం సరైన పద్ధతి కాదు.

– శిరీష, సర్పంచ్, ఏఎంపురం, సత్యవేడు మండలం

సర్పంచులకు విలువ లేదు



ప్రత్యక్ష ఎన్నికల ద్వారా గెలిచిన సర్పంచులకు కూటమి ప్రభుత్వంలో విలువ లేకుండా పోయింది. అందుకు నిదర్శనం పల్లె పండుగ రోడ్లను ఏక పక్షంగా కూటమి నేతలకు అప్పగించడమే. మా పంచాయతీలో మంజూరైన పల్లె పండుగ రోడ్లను స్థానిక టీడీపీ నేతలు నిర్మాణం చేశారు. ప్రశ్నిస్తే సమాధానం లేదు. అధికారులు సైతం వారికి వంత పాడుతున్నారు.

–వెంకటమ్మ, సర్పంచ్, బీఎన్‌కండ్రిగ

పద్మావతీపురం.. పడకేసిన పారిశుద్ధ్యం



కొళాయికి ట్యాప్ లేకపోవటంతో వృథాగా పోతున్న నీరు



గుంతలమయంగా వీధి రోడ్డు



మురుగునీరు నిల్వ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కాటూరు పంచాయతీ పరిధిలోని పద్మావతీపురం దళితవాడలో పారిశుద్ధ్యం పడకేసింది. వీధులు మురుగు నీటి నిల్వలు దర్శమిస్తున్నాయి. కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగుతో నిండి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వర్షం పడితే దళితవాడలోని వీధుల్లోని గుంతల్లోకి వర్షం నీరు చేరడంతో బురదమయంగా మారుతున్నాయి. మురుగు నీటి నిల్వతో దోమలు విపరీతంగా ఉండటంతో జనం జ్వరాల బారీన పడుతున్నారు. తాగునీటి చేతిపంపు మరమ్మతుకు నోచుకోకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మరోవైపు తాగునీటి కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. దళితవాడలో ఎక్కడ చూసినా పేడ దిబ్బలే దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

రాజగోపురానికి ఆధ్యాత్మిక శోభ



రాజగోపురంపై లేజర్ కాంతులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఉన్న రాజగోపురంపై ఆదివారం రాత్రి లేజర్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. రానున్న మహాశివరాత్రి ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా దేవతామూర్తుల చిత్రాలు ప్రజలను ఆకర్షించాయి. వీటిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పరిశీలించారు.

హరిహరేశ్వరస్వామికి కుంభాభిషేకం



కలశానికి పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పనస కోనలోని హరిహర తీర్థంలో వెలసిన హరహరేశ్వరస్వామికి ఆదివారం ఆగమోక్తంగా కుంభాభిషేకం జరిగింది. ఆలయాన్ని పునఃనిర్మించడంతో ఈ పూజలు చేశారు. ఆలయ శిఖరాలకు అభిషేకాలు చేశారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యల పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో చిత్తూరు కలెక్టర్



ఆలయం వద్ద చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్

శ్రీకాళహస్తి : జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అధ్వాన పారిశుద్ధ్యంపై ఆగ్రహం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మృదుల

బుచ్చినాయుడుకండ్రిగ : అధ్వాన పారిశుద్ధ్య నిర్వహణపై డిప్యూటీ డీఎంహెచ్ఓ మృదుల ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పెద్దపాలేడు దళితవాడలో విష జ్వరంతో చిన్నారి దివ్యశ్రీ మృతి చెందడంతో ఆదివారం డిప్యూటీ డీఎంహెచ్ఓ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు దివాకర్, విద్యాసాగర్ సిబ్బందితో కలసి వైద్యశిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. మురుగు కాలువలను వెంటనే శుభ్రం చేయించి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించాలని ఆమె ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టకపోతే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటేశులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఎన్‌కే యూత్ క్రికెట్ విజేత సూళ్లూరుపేట



క్రికెట్ టోర్నీ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

బుచ్చినాయుడుకండ్రిగ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బీఎన్‌కే యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నీ విజేతగా సూళ్లూరుపేట జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన సూళ్లూరుపేట జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన నీర్పాకోట జట్టుకు రూ.10 వేల నగదును నిర్వాహకులు శాంతకుమార్,సురేష్, తిరుమల, దొర్రై, అఖిల్ అందజేశారు.

రోడ్డుపై ఆంధ్ర జంట సిగపట్లు

- భర్త, అతడి స్నేహితురాలిని చితక్కొట్టిన భార్య
- తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై ఘటన

తిరువళ్లూరు: భార్యను వదిలేసి మరో మహిళతో షికార్లు కొట్టడమే కాకుండా కోర్టుకు సైతం సంబంధిత మహిళ రావడంతో ఆగ్రహించిన భార్య తన భర్తతో పాటూ ఆ మహిళపై కూడా దాడికి యత్నించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నడిరోడ్డుపై ఆంధ్ర దంపతుల సిగపట్టును చూడడానికి భారీగా జనం గుమికూడడంతో ట్రాఫిక్‌కు సైతం తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా తిరువేళాంగాడు యూనియన్ వరదాపురం గ్రామానికి చెందిన సత్యకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన మునీంద్రతో పదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి పిల్లలు సైతం ఉన్నారు. ఈక్రమంలో మునీంద్ర వ్యాపారం పెట్టడానికి సత్య తన 40 సవర్ల బంగారు నగలు, బ్యాంకులో తన పేరుపై పది లక్షల రుణాన్ని సైతం తీసి భర్త వ్యాపారం కోసం ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ నగదుతో శ్రీకాళహస్తి ప్రాంతంలో మునీంద్ర సత్య కోళ్లఫామ్‌ను ఏర్పాటు చేశాడు. కొన్నాళ్ల తరువాత బ్యాంకులో చెల్లించాల్సి వాయిదాను మునీంద్ర సరిగ్గా చెల్లించకపోవడంతో పాటు వ్యాపారం బాగా పుంజుకున్న క్రమంలో వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఇదే విషయంపై భార్య భర్త మధ్య వివాదం చెలరేగింది. మునీంద్ర విడాకులు కావాలని స్థానిక కోర్టుకు వెళ్లగా, తనకు విడాకులతో పాటూ నష్టపరిహారం, నగలు తిరిగి ఇప్పించాలని, బ్యాంకులో పొందిన రుణాన్ని సక్రమంగా తిరిగి చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ సత్య తిరువళ్లూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తిరువళ్లూరు కోర్టులో విచారణ సాగుతున్న నేపథ్యంలో శనివారం మునీంద్ర, సత్య తదితర ఇద్దరు కోర్టుకు హాజరయ్యారు. వాయిదా ముగిసిన తరువాత ఇంటికి వెళ్లేక్రమంలో మునీంద్ర తనతో పాటు వచ్చిన మహిళతో ఆటోలో వెళ్లడాన్ని సత్య గుర్తించి ఆగ్రహానికి గురైంది. వెంటనే ఆటోలో భర్తను వెంబడించి ఇద్దరిపై దాడికి దిగింది. తన కుటుంబం నడిరోడ్డున పడడానికి కారణం నీవేనంటూ భర్తతో పాటు వచ్చిన మహిళపై సైతం దాడి చేసింది. దీంతో ఆటోలో వున్న మహిళ కిందికి దూకి పరుగులు పెట్టింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకుని సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు ఇద్దరిని పోలీసు స్టేషన్‌కు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా ఈ వ్యవహారాన్ని కొందరు వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారిన క్రమంలో శనివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.



కోర్టుకు వచ్చిన మునీంద్ర